క్లుప్తంగా

ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వీరయ్య

బోథ్: మండల ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ధన్నూర్ గ్రామానికి చెందిన వీరయ్య నియమితులయ్యారు. ఫార్మసిస్ట్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

'అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు'

ఇంద్రవెల్లి: అక్రమంగా మద్యం అమ్మిన, తరలించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. గురువారం మండలంలోని హర్కాపూర్ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న పోలె మారుతి ఇంట్లో దాడులు నిర్వహించి, రూ. 5500 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎదులాపురం: పట్టణంలోని రెల్వే స్టేషన్ సమీప ఠాకూర్ హోటల్ బస్టాండ్ వద్ద గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం సముజ్జ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఆర్టీసీ డీఎం కల్పన ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

గుడిహత్నూర్: మండల కేంద్రంలో టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవిస్తున్న సుబ్బరత్నమ్మ గత 20 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భర్త రామకృష్ణ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ పవార్ రవీందర్ నాయక్ రామకృష్ణను పరామర్శించి రూ.5వేల నగదు అందజేశారు. ఆయన వెంట మాధవ్ కేంద్రే, కేంద్రే సుదర్శన్ ఉన్నారు.

18 నుంచి క్రికెట్ పోటీలు

నేరడిగొండ: మండలంలో ఈనెల 18 నుంచి నేరడిగొండ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) నిర్వహించడం జరుగుతుందని నేరడిగొండ క్రికెట్ క్లబ్ నిర్వాహకులు జె.పవన్ కుమార్, దేవేందర్ రెడ్డి, లఖన్, అనిల్, హరీష్, దినేష్, యోగేశ్వర్, జకీలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లీగ్‌లో మొత్తం 8 జట్లు, 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: సీపీఐ భీంసరి శాఖ మాజీ కార్యదర్శి విఠల్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను సీపీఐ నాయకులు గురువారం పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో నాయకులు విలాస్, గాజెంగుల రాజు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులను పూజిత, శ్రావణిలను ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఫలితాలు సాధించడంపై అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు మామిడిపల్లి వసంత, ప్రధానోపాధ్యాయులు డి.వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నేరడిగొండ: బీఆర్ఎస్ చెందిన తేజాపూర్ మాజీ సర్పంచ్ అన్నెల నారాయణ రాజీనామా చేసి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, కొమురం కోటేష్, పసుల చంటి, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డొంగర్‌గావ్, అబ్దుల్ రవూఫ్‌ఖాన్, మాజీ సర్పంచ్ కుమారుడు మారుతి, పలువురు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మల్యాల కరుణాకర్, ఆడే శీల, అంకతి రవీందర్, బాలాజీ సోంటక్కే, కరాడ్ బ్రహ్మానంద్, నాగ్‌నాథ్, బాలాజీ, నరేశ్ పాల్గొన్నారు.

'బీజేపీని ఓడించాలి'



ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

తాంసి: ప్రభుత్వ రంగ సంస్థల మనుగడను ప్రశ్నార్థకంగా చేస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కిరణ్ అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ఆశన్న, స్వామి, అనిల్, రమాకాంత్ పాల్గొన్నారు.

రోడ్డుపై పడిగాపులు

- తలమడుగులో బస్‌షెల్టర్ కరువు
- ఎండకు వానకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రోడ్డుపక్కన వాహనాల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

తలమడుగు: మండల కేంద్రంలోని మర్రిచెట్టే ప్రయాణికులకు బస్‌షెల్టర్ నీడనిస్తుంది. గత ఎన్నో ఏళ్ల నుంచి మండల కేంద్రంలో ప్రయాణికులకు బస్‌షెల్టర్ లేక లేక నానా అవస్థలు పడుతున్నారు. తలమడుగు మండలంలో 28 గ్రామ పంచాయతీలున్నాయి. మండల కేంద్రానికి నిత్యం ప్రజలు వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యక్తిగత పనుల నిమిత్తం, బ్యాంకు పనుల నిమిత్తం వస్తుంటారు. అలాగే మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్, సమీపంలోని మహారాష్ట్రకు, చుట్టుపక్కల మండల కేంద్రాలకు ప్రయాణిస్తుంటారు. కాగా.. మండల కేంద్రంలో ఇప్పటివరకు బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎండాకాలం, చలికాలం, వర్షాకాలం మూడు కాలాల పాటు చెట్టునే ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రయాణికులు పడరాని పట్లు పడుతున్నారు. గత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మించేందుకు హామీఇచ్చారు. కానీ హామీలు అమలుకు నోచుకోలేదు. ఎండ, వానాకు పడరాని పాట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

మర్రిచెట్టే దిక్కు..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి తలమడుగు మండల కేంద్రానికి నిత్యం ఆర్టీసీ బస్‌లు నడుస్తుంటాయి. ఆదిలాబాద్ నుంచి కోసాయి, ఉమ్రీ గ్రామాలను కలుపుకొని ఆర్టీసీ బస్‌లు నిత్యం నడుపుతారు. అలాంటి మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న మర్రిచెట్టుని ఆశ్రయించి బస్టాండ్‌గా ఉపయోగిస్తున్నారు. వేసవిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కుచులాపూర్ గ్రామంలో కూడా బస్‌షెల్టర్ లేక చెట్టుకింద పడిగాపులు కాస్తున్నారు. బరంపూర్ గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డి వారి కుటుంబసభ్యుల జ్ఞాపకార్థం రూ. 10 లక్షలతో బస్టాండ్ నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి బస్‌షెల్టర్ నిర్మించాలని గతంలో ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు పలుమార్లు విన్నవించినా.. పట్టించుకున్న నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం, అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



ప్రజా సమస్యలపై పట్టింపు లేని పాలకుల వల్లే దశాబ్దాలుగా ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణం జరగడం లేదు. పిల్లలు, మహిళలు వృద్ధులు ఎండలో ఉండి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పురుషోత్తం, ప్రయాణికుడు

ఇబ్బంది పడుతున్నాం



మండల కేంద్రానికి ప్రభుత్వ కార్యాలయంలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. మండల కేంద్రంలో కనీస బస్టాండ్ లేక, మరుగుదొడ్లు, మూత్రశాల లేక నానా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బస్టాండ్ ఏర్పాటు చేయాలి.

– మోహన్, ప్రయాణికుడు

బీజేపీ గెలుపునకు కృషి చేద్దాం



నేరడిగొండ: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



తలమడుగు: ప్రచారం చేస్తున్న నాయకులు

నేరడిగొండ: బీజేపీ గెలుపునకు కలిసికట్టుగా కృషి చేద్దామని మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. గురువారం మండలంలోని బుర్కపల్లి, పాషాతండా, రాజుర, చిన్నరాజుర, ఇస్పూర్, సక్రియనాయక్‌తండా, వాంకిడి, నారాయణపూర్, ధార్మిక్‌నగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రవీణ్, నారాయణ, వెంకటేష్, భీంరావు, శంకర్, పరశురాం, మహేందర్ రెడ్డి, ఆడెపు నరేందర్, కృష్ణ, కోటేష్, రమణ, శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని జెడ్పీటీసీ ఆర్క పుష్పలత అన్నారు. గురువారం మండలంలోని గలియబాయితండా, ఏమయికుంట గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం ఉంటే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి రాజలింగు, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, కదం బాబారావులు అన్నారు. గురువారం మండలంలోని సిరిచెల్మలో ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ హయాంలో అనేక కుంభకోణాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు తృప్తి గంగాధర్, దయకుమార్ రెడ్డి, గట్టు మహేందర్, తుమ్మల రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండల నాయకులు కనపర్తి చంద్రకాంత్, మండల అధ్యక్షుడు స్వామి అన్నారు. గురువారం రుయ్యడి, ఉమ్రీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, దేవన్న, కిరణ్, నారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, అశోక్, సుభాష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మళ్లీ బీజేపీని గెలిపించండి'

గుడిహత్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ బీజేపీని గెలిపించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు, తోషం, సీతాగోంది గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ 400 సీట్లతో గెలిపించి చరిత్ర తిరగ రాయనుందన్నారు. ప్రపంచంలో దేశాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు బీజేపీ కృషి చేస్తోందన్నారు. మోదీకి మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, మండలాధ్యక్షుడు కేంద్రే శివాజీ, వైస్ ఎంపీపీ భరత్, కేంద్రే లక్ష్మణ్, జాడి సుభాష్, సుధాకర్ రెడ్డి, వామన్‌గిత్తే, చాటే సంభాజీ, శైలేందర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న గోడం నగేశ్

13వరకు జొన్న కొనుగోళ్లు బంద్

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో శుక్రవారం నుంచి ఈ నెల 13 వరకు జొన్న కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు బేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా కొనుగోళ్లు బంద్ ఉంటాయన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు. తిరిగి ఈనెల 14నుంచి పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డ్‌లో కొనసాగుతున్న జొన్న కొనుగోళ్లను నాలుగు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సీఈవో గంగన్న తెలిపారు. మార్కెట్‌లో జొన్న నిల్వలు పేరుకుపోవడం, వాతావరణంలో మార్పుల కారణంగా ఈనెల 10 నుంచి 13 వరకు కొనుగోళ్లు నిర్వహించడం లేదని తెలిపారు. 14 నుంచి యథావిధిగా కొనుగోళ్లు చేపడుతామన్నారు. రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

తాంసి: తాంసి మండల కేంద్రంలో సబ్‌మార్కెట్ యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు సీఈవో కేశవ్ తెలిపారు. తాంసి సబ్‌మార్కెట్ యార్డులో జొన్నల నిల్వలు ఎక్కువగా ఉన్నందున, వర్ష సూచనతో పాటు పార్లమెంట్ ఎన్నికల ఉన్నందున ఈనెల 10 నుంచి 13 వరకు జొన్న కొనుగోళ్లు నిలిపివేయడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి మార్కెట్‌యార్డుకు జొన్నలు తీసుకురావద్దన్నారు.

'కాంగ్రెస్, బీజేపీని నమ్మి మోసపోవద్దు'



జైనథ్: ప్రచారం చేస్తున్న ఎంపీపీ గోవర్ధన్



ఇచ్చోడ: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

జైనథ్: కాంగ్రెస్, బీజేపీని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. గురువారం మండలంలోని సావాపూర్, ఆకుర్ల గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. బీజేపీ సామాన్య ప్రజల కోసం చేసిందేమి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు.

ఇచ్చోడ: కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్నిరంగాల ప్రజలు అభివృద్ధి సాధించాలంటే బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. ఇప్పటికే రైతుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. కార్యక్రమంలో గాడ్గే సుభాష్, ముండే పాండురంగ్, గణేష్ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మల్లెపూల సుభాష్, ప్రవీణ్, రఫీ, రమణ గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కోరారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామగిరి వాసు, దినేశ్, అన్వేశ్, శ్రీకాంత్, సాయి, పర్వేజ్ పాల్గొన్నారు.

నార్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో అబద్దాల హామీతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా, దుర్గానగర్, విజయ్‌నగర్ కాలనీలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ కాశీం, లోఖండే చంద్రశేఖర్, రాథోడ్ సుభాష్, కనక ప్రభాకర్, జితేందర్, అర్జున్ పాల్గొన్నారు.

తలమడుగు: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, అభిరామ్ రెడ్డి అన్నారు. గురువారం తలమడుగు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసే బీజేపీ పార్టీని ప్రజలు బొంద పెట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చంటి, రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మావల మండలంలోని వాఘాపూర్‌లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, ఎస్టీ సెల్ చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావు, గిమ్మ సంతోష్‌రావు, బండి దేవిదాస్ చారి పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ. 400లకు పెంపు

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న కూలిని రూ. 400కు పెంచనున్నారని ఆ పార్టీ టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డిలు అన్నారు. మండలంలోని తంతోలి, అంకోలి, లోకారి గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు.

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కైలాస్‌నగర్‌లో, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని భగవతీనగర్‌లో, చిల్కూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భాగ్యనగర్‌లో, కంది సాయిమౌన రెడ్డి ఆధ్వర్యంలో ఖిల్లా పర్కోటా, బడాతలాబ్, బద్కామహల్లా, తిర్పెల్లి, కోలిపూర, బ్రహ్మణ్‌వాడ, బొక్కలగూడ, ఖానాపూర్ కాలనీల్లో ప్రచారం చేశారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏంద, శాంతినగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. హస్నాపూర్, ఎక్స్‌రోడ్డు, తదితర చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

తలమడుగు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేసే బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రుయ్యాడి, సఖినాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆత్రం సుగుణను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ప్రకాష్ రావు, మారుతి, అశోక్, ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులు గొర్ల రాజు యాదవ్ ఓ హోటల్‌లో బజ్జీలు వేస్తూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు మెరుగు భోజన్న, శేఖర్, చట్ల ఉమేష్, మహమ్మద్, లింగారెడ్డి, నాసర్ అహ్మద్, అబూద్, సురేందర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కాంగ్రెస్ విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వడూర్, సుర్దాపూర్, దర్బ, దర్బతండా, రాజులతండా, కుప్టి, కుమారి, తర్నం, వాగ్ధారి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎరడ్ల చంద్రశేఖర్, శ్రీకాంత్ రెడ్డి, బుక రాములు, ఈర్ల శ్రీకాంత్, బొర్ర నవీన్, జాదవ్ వసంత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ శబరిమాతా ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరిగిన పాద పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు పెంట వెంకటరమణ, రాథోడ్ సురేందర్, ఏలేటి రవీందర్ రెడ్డి, లచ్చన్న పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన జొన్న

ఇచ్చోడ: అకాల వర్షం జొన్న రైతులను పరేషాన్ చేసింది. గురువారం సాయంత్రం వర్షం కురవడంతో మార్కెట్‌యార్డులో విక్రయానికి తీసుకువచ్చిన జొన్న కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. పలువురి రైతుల జొన్న పూర్తిగా తడిసింది. గత పదిహేన్ రోజుల నుంచి ప్రభుత్వం మార్కెట్‌యార్డులో జొన్నలను కొనుగోలు చేస్తోంది. రైతులు పంటను అమ్ముకోవడానికి మార్కెట్ యార్డులోకి తీసుకువచ్చారు. కొంత మంది రైతులు జొన్న కుప్పలపై కవర్లు కప్పి, పంట తడవకుండా జాగ్రత్త పడ్డారు.



వరదకు కొట్టుకుపోతున్న జొన్న

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

బోథ్: మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో జారీ చేయడంపై తెలంగాణ మున్నూరుకాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం హర్షం వ్యక్తం చేశారు. గురువారం బోథ్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో కాంగ్రెస్ చెందిన మున్నూరు కాపు నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలోనే అత్యధిక జనబలం కలిగిన మున్నూరుకాపుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మల్లెపూల సత్యనారాయణ, చట్ల ఉమేష్, గుండయ్య, గాజుల పోతన్న, అనిల్, లింగారెడ్డి, గడ్డల నారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో గల పద్మశాలి గార్డెన్ ఏరియాలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదన్నారు. బీజేపీ రాముడి పేరుతో ఓట్లు దండుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అజయ్, స్వాగత్, రమేష్, రాము, స్వరూప, మమత, సురేఖ, త్రిశూల తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జోగు రామన్న

ధ్యానంతో మానసిక ప్రశాంతత

తలమడుగు: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ నాగుల సునీత వెంకట్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఏడు రోజుల ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన సదస్సు సప్త ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరూ మానసిక ఉల్లాసం కోసం ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజు ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో కటిపల్లి సురేశ్ రెడ్డి, నీలగిరి అశోక్, నల్ల ప్రతాప్ రెడ్డి, నల్ల కిష్టారెడ్డి, ఇందిరమ్మ, సునీత రెడ్డి, రాధమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీత వెంకట్